

పూజలు చేస్తున్న అర్చకులు

నయన మనోహరం

శ్రీవారి పుష్పయాగం

ముగిసిన

ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

(వివరాలు 7లో..)



ఆటో నడుపుతున్న మంత్రి సవిత

ఆటో నడిపిన మంత్రి

రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పెనుకొండలో ఆదివారం ఆటో నడుపుతూ సందడి చేశారు. నూతన ఆటోలో కార్యకర్తలను కూర్చోబెట్టుకుని, పట్టణ వీధుల్లో నడిపారు. టీడీపీ కార్యకర్త వడ్డె రాముకు మంత్రి ఆటో గిఫ్ట్‌గా ఇచ్చారు. సొంత నిధులతో కొనుగోలు చేసి, రాముకు జీవనోపాధి నిమిత్తం అందజేశారు. ఆ ఆటోను మంత్రి ప్రారంభించారు. అనంతరం సరదాగా ఆటో నడిపారు. ఆటో కొనుగోలు చేసి ఇచ్చిన మంత్రికి రాము కృతజ్ఞతలు తెలిపాడు.

-పెనుకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి)

ఈదురుగాలుల బీభత్సం

తోడైన వడగండ్ల వాన..

భారీగా దెబ్బతిన్న ఉద్యాన పంటలు

అనంత జిల్లాలోనే రూ.34.91 కోట్ల నష్టం (7లో..)



పుట్లూరు మండలంలో ఈదురుగాలులకు నేలకొరిగిన అరటి పంట

మొదలైన ఇంటర్ మూల్యాంకనం

కొత్తచెరువు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల మూల్యాంకనం మొదలైంది. స్పాట్‌ను డీఐఈఓ రఘునాథరెడ్డి పర్యవేక్షించారు. ఇతర జిల్లాల నుంచి ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి 1,09,725 జవాబు పత్రాలు వచ్చాయని ఆయన తెలిపారు. వాటికి సబ్జెక్టు వారీగా కోడింగ్ ఇస్తూ మూల్యాంకనం చేస్తున్నామన్నారు. హిందీ జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేశామన్నారు. సోమవారం సివిక్స్, తెలుగు, ఇంగ్లీష్, సంస్కృతం, గణితం పూర్తవుతాయన్నారు. ఏప్రిల్ 2లోగా మూల్యాంకన ప్రక్రియ ముగుస్తుందన్నారు. స్పాట్‌కు చీఫ్ ఎగ్జామినర్స్, అసిస్టెంట్ ఎగ్జామినర్స్‌తో కలిపి 400 మంది సిబ్బందిని నియమించామని ఆయన వివరించారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

పుట్టపర్తిటౌన్, మార్చి23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు పాల్గొంటారనీ, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తిండి కోసం..



బత్తినగారిపల్లి సమీప పొలాల్లో సంచరిస్తున్న నెమళ్లు

నంబులపూలకుంట, మార్చి23(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులకు తిండి తిప్పలు మొదలయ్యాయి. అడవుల్లో ఆహారం దొరక్క గ్రామాల్లోకి వస్తున్నాయి. మండలంలోని బత్తినగారిపల్లి సమీప పొలాల్లోకి తిండిగింజలకోసం ఆదివారం ఉదయం నెమళ్లు వచ్చాయి. గ్రామ సమీపంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతంలో తిండి, నీరు లేక పొలాల్లో సంచరిస్తున్నాయి. అలా.. వరి కోసిన పొలాల్లో సంచరిస్తూ కనిపించాయి. గతంలో నేమళ్లు కనిపించడమే అరుదనీ, ప్రస్తుతం పొలాల్లోకే వస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

ఉద్ధర పంచాయతీ



గ్రామ పంచాయతీ కార్యాలయం (ఫైల్)

అద్దె మాఫీకోసం బతికున్న వ్యక్తిని చంపేశారు



కార్డులో బతికున్న వ్యక్తిని డెత్ అనిరాసిన దృశ్యం, సుధాకర్‌రావు (ఇన్‌సెట్‌లో..)

అద్దె మాఫీ చేయించుకోవడం కోసం బతికున్న వ్యక్తులను చనిపోయినట్లుగా రికార్డు సృష్టిస్తున్నారు. దీనికి నిదర్శనం 2022లో పంచాయతీకి చెందిన 24వ రూమును కటిక సుధాకర్‌రావు వేలంపాటలో దక్కించుకున్నాడు. ఇందుకుగాను నెలకు రూ.17 వేలు అద్దె చెల్లించాల్సి ఉంది. అయితే ఆ గదిని నాగేంద్ర అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చాడు. ఆ గదిలో జిరాక్సు సెంటర్ నిర్వహిస్తున్న నాగేంద్ర అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఓ అధికారి సుధాకర్‌రావు మృతి చెందినట్లు రికార్డులో రాసి, ఆ గదిని మరొకరికి ఇచ్చాడు. దీంతో పంచాయతీకి రావాల్సిన 4.8 లక్షలకు గండిపడింది.

అద్దె వసూళ్లు ఏవీ?

2021 నుంచి 2025 వరకు నాలుగేళ్లకు వేలం పాటను నిర్వహించారు. ఈ వేలం పాట ద్వారా పంచాయతీకి వారపు, దిన సంతలు, బస్టాండు ద్వారా రూ.70.61 లక్షల ఆదాయం చేకూరింది. ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు 49 వ్యాపారగదుల వేలం ద్వారా పంచాయతీకి రూ.1.16 కోట్లకుపైగా ఆదాయం వచ్చింది. వేలం పాట ద్వారా వ్యాపార గదులు పొందినవారు ప్రతినెలా అద్దె చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ 49 గదులకు ఇప్పటి వరకు 10 మంది మాత్రమే అద్దె చెల్లించారని అధికారులు చెబుతున్నారు. మిగిలిన వాటికి సంబంధించి రూ.73.25 లక్షల బకాయిలు పంచాయతీకి చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిల వసూళ్లలో పంచాయతీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బకాయిల సంత

గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 2021-22లో వారపు సంతను బెస్త నాగలక్ష్మి రూ.7.06 లక్షలకు వేలం పాడారు. రూ.5 లక్షలు డిపాజిట్ చెల్లించి ఇంకా రూ.2.06 లక్షలు చెల్లించలేదు. 2022-23లో పంచాయతీ సర్పంచ్ బావ మల్లికార్జున రూ.7.76 లక్షలకు వేలం పాడారు. డిపాజిట్ రూ.5 లక్షలు చెల్లించారు. ఇంకా రూ. 2.76 లక్షలు చెల్లించలేదు. 2023-24 లో మాజీ ఎంపీపీ భర్త నారాయణ రూ. 14.35 లక్షలకు వేలం పాడారు. రూ.6 లక్షలు డిపాజిట్ చెల్లించారు. రూ. 8.35 లక్షలు చెల్లించలేదు. 2024-25లో అప్పన్నగారి ఉపేంద్ర రూ.6.03 లక్షలకు వేలం పాడారు. డిపాజిట్ కింద రూ.5 లక్షలు చెల్లించారు. రూ.1.03 లక్ష చెల్లించాల్సి ఉంది.

మేజర్ పంచాయతీలో మొండి బకాయిలు

- మొత్తం వసూలు కావాల్సింది రూ.1.48 కోట్లు
- వేలం పాడి సొమ్ము ఎగ్గొడుతున్న ఘనులు
- బతికి ఉన్నా చనిపోయినట్లుగా చూపి మాఫీ
- అధికారుల అలసత్వం, అవినీతి వల్లే సమస్యలు
- కొత్తచెరువు పంచాయతీలో కుంటుపడిన అభివృద్ధి

వేలంపాట బకాయిలు పేరుకుపోవడంతో మేజర్ పంచాయతీ అభివృద్ధి కుంటుపడింది. వేలంపాట పాడిన వారు డిపాజిట్ మాత్రమే చెల్లించి మిగిలిన సొమ్ము చెల్లించకపోవడంతో బకాయిలు రూ.1.48కోట్లకు చేరుకున్నాయి. పంచాయతీ సిబ్బంది, అధికారుల మెతక వైఖరి వల్లే బకాయిలు పేరుకుపోతున్నాయనే విమర్శలు వినవస్తున్నాయి.

కొత్తచెరువు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా మార్చి నెలలో కొత్తచెరువు మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన వారపుసంత, దినసంత, బస్టాండు, సులబ్ కాంప్లెక్సు, వ్యాపార సముదాయాలను అద్దెకు ఇవ్వడానికి బహిరంగ వేలం పాట నిర్వహిస్తారు. వేలం పాటలో వాటిని దక్కించుకున్నవారు డిపాజిట్ మాత్రమే చెల్లిస్తున్నారు. మిగిలిన సొమ్ముకు ఎగనామం పెడుతున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. గ్రామ ప్రజలు ఇంటి గుత్తలు సకాలంలో చెల్లించకపోతే ట్యాప్(కొళాయి) కనెక్షన్లను తొలగించే అధికారులు బకాయిలు ఎందుకు వసూలు చేయడం లేదని పంచాయతీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది అధికారులు, సిబ్బంది వేలం పాటపాడిన వారి నుంచి ముడుపులు తీసుకొని మొండి బకాయిలకింద, బతికుండగానే మృతి చెందినట్లు ధ్రువీకరిస్తూ బకాయిలను రికార్డులలో మాఫీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మొండి బకాయిలు ఇవే..

2021-22లో వేలంలో రూము నెంబర్ 30ని నెలకు రూ.27 వేలు అద్దె చెల్లించేలా ఓ వ్యక్తి దక్కించుకున్నాడు. మూడేళ్లకు దాదాపు రూ. పది లక్షలు చెల్లించాల్సి ఉంది. 14 గదికి రూ.1.18 లక్షలు, 21 గదికి రూ.2.7 లక్షలు, 28 గదికి రూ.4.24 లక్షలు, 37 గదికి రూ. 3.74 లక్షలు 45 గదికి రూ.1.08 లక్షలు వేలం పాడినవారు ఎగ్గొట్టారని పంచాయతీ అధికారులు తెలిపారు. వీరికి నోటీసులు ఇచ్చినా డబ్బులు పంచాయతీకి చెల్లించలేదన్నారు.

కుంటుపడుతున్న అభివృద్ధి

కొత్తచెరువు మేజర్ పంచాయతీకి దినసంత, బస్టాండు, సులబ్ కాంప్లెక్సు వ్యాపార గదులకు వేలం ద్వారా దాదాపు రూ.1.8 కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. ఇతర ఆదాయలు కలుపుకొని పంచాయతీకి దాదాపు రూ.3 కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. అయితే గతంలో పనిచేసిన కొందరు పంచాయతీ అధికారులు అవినీతికి పాల్పడి పంచాయతీ సొమ్మును ఎవరికివారు దోచేశారనే ఆరోపణలు ఉన్నాయి. వారిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అయితే అవినీతికి పాల్పడిన వారిని ఓ ఉన్నతాధికారి కాపాడి పోస్టింగ్ సైతం ఇచ్చారన్న ఆరోపణలు లేకపోలేదు. ఎవరికి వారు పంచాయతీ సొమ్మును దోచేస్తుండటంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉందని గ్రామప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తిగా చెల్లించనివారు వీరే...

2023-24లో దినపు సంతను సర్పంచ్ తమ్ముడు రూ. 4.78 లక్షలకు వేలం పాడారు. ఒక్క రూపాయి కూడా పంచాయితీకి చెల్లించలేదని అధికారులు తెలిపారు. బస్టాండులో సుంకం వసూలుకు బళ్లారి బాబు 2023-24లో రూ.6.71 లక్షలకు వేలంపాడి పైసా కూడా చెల్లించలేదు. 2021-22లో బస్టాండులో సుంకం వసూలుకు డి.చిన్ననరసింహులు రూ. 3.61 లక్షలకు వేలంపాడారు. పంచాయతీకిరూ. 3 లక్షలు చెలించారు. రూ.61 వేలు చెల్లించలేదు. 2022-23లో పంచాయతీకి బెస్త నాగలక్ష్మి రూ.8.07 లక్షలకు వేలంపాడి రూ. 5.07 లక్షలు కట్టలేదు. వీరంతా పంచాయతీకి డబ్బు చెల్లించాల్సి ఉన్నా అధికారులు మాత్రం వీరిపై చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పంచాయతీ అధికారులు గత వేలంపాట బకాయిలను వసులు చేయకనే వేలంపాట నిర్వహిస్తున్నారు. దీంతో పాతవారే మరలా మరొకరి పేరు మీద వేలం పాడుతూ పంచాయతీకి వేలం సొమ్మును ఎగ్గొడుతున్నారు.

వారిపై ఆర్‌ఆర్ యాక్టు పెడతాం

బకాయిల విషయం నాదృష్టికి వచ్చింది. గతంలో దిన, వారపుసంతలు, బస్టాండు, సులభ్ కాంప్లెక్సు, వ్యాపార గదులకు బహిరంగ వేలంపాటపాడి డబ్బు చెల్లించని వారందరికీ తొలుత షోకాజ్ నోటీస్ అందజేస్తాం. స్పందించకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లి వారిపై ఆర్‌ఆర్ యాక్టు కింద చర్యలు తీసుకుంటాం. గ్రామ పంచాయతీ ద్వారా అందే ప్రయోజనాలను నిలిపివేస్తాం.

-సమత, డీఎల్‌పీఓ



దెబ్బతిన్న నది సైడ్‌వాలు

దెబ్బతిన్న సువర్ణముఖి కాలువ గట్లు



- నది ఉధృతికి కొట్టుకుపోయిన అడ్డుగోడలు
- చెరువులకు చేరని నీరు..
- ఆందోళనలో రైతులు

మరమ్మతులు ఎప్పుడో?

మడకశిర, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కాలువ గట్లు, అడ్డుగోడలు దెబ్బతినడంతో సువర్ణ ముఖి నది నీరు వృథాగా పోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు నది ఉప్పొంగి ప్రవహించడంతో పలు చోట్ల కాలువలకు గండ్లు పడ్డాయి. అడ్డుగోడలు కొట్టుకుపోయాయి. దీంతో నది నీరు చెరువులకు చేరడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో సాగు, తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెగిన కాలువల మరమ్మతుల కోసం గత ప్రభుత్వంలో రూ.7.5 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే నేటికీ నిధులు మాత్రం విడుదల కాలేదు. కోతకు గురైన కాలువలు, దెబ్బతిన్న అడ్డుగోడల మరమ్మతులు చేపడితే సువర్ణముఖినది నీరు కాలువల ద్వారా చెరువులకు చేరుతాయి. తద్వారా ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెంపొంది, బీడు భూములు సస్యశ్యామలం అయ్యే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా నియోజకవర్గంలోని అగళి ప్రాంతంలో 800 అడుగుల లోతు తవ్వినా చుక్క నీరు దొరకడం లేదు. దశాబ్ద కాలంగా సరైన వర్షాలు కురవకపోవడంతో పొలాలను బీళ్లుగా వది లేశారు. కట్టకాలువల మరమ్మతులు చేపట్టి, కృష్ణా జలాలతో నియోజకవర్గంలో అన్ని చెరువులను నింపి తాగు, సాగు నీటి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



నదికి అడ్డంగా నిర్మించిన గోడ దెబ్బతిన్న దృశ్యం

కాలువల గండ్లు పూడిస్తేనే..

సువర్ణముఖి నది కాలువలకు పడిన గండ్లను పూడ్చకపోవడంతో వర్షాలు కురిసి, నది ప్రవహించినప్పుడల్లా దిగువ ప్రాంతాలకు నీరు వృథాగా పోతోంది. దీంతో చెరువులకు నీరు చేరడం లేదు. నది కాలువలకు పడిన గండ్లను, కోతకు గురైన కాలువలను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. కర్ణాటక ప్రాంతంలోని నజ్జేహోసనహళ్లి వద్ద నదికి అడ్డంగా గోడ కట్టి నీటిని కట్టు కాలువ ద్వారా అగళి చెరువుకు తీసుకుని వచ్చేవారు. అయితే ప్రస్తుతం ఆ గోడలు స్థితిలావస్థకు చేరుకున్నాయి, వాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. అలాగే ఇరిగేపల్లి చెరువుకు నీటిని మళ్లించడానికి నందరాజన గ్రామ పమీపంలో అడ్డుగోడ నిర్మించారు. అయితే మూడేళ్ల కిందట కురిసిన భారీవర్షాలకు ఆ గోడ పడిపోయింది. దీంతో ఇరిగేపల్లి చెరువుకు నీరు రాకుండా పోయిందని ఆ ఊరి ప్రజలు వాపోతున్నారు వెంటనే మరమ్మతులు చేట్టాలని కోరుతున్నారు.

రూ. 7.5 కోట్లతో ప్రతిపాదనలు

సువర్ణముఖినదిపై దెబ్బతిన్న అడ్డుగోడలు, కోతకు గురైన నది కట్టకాలువల మరమ్మతులు చేపట్టడానికి ప్రభుత్వానికి రూ. 7.5 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు అయిన వెంటనే పనులు చేపడతాం. -శ్రీనివాసులు, ఇరిగేషన్ ఏఈ

నూతన కమిటీ సభ్యులు →



పంచాయతీ కార్యదర్శుల కమిటీ ఎన్నిక

పుట్టపర్తి రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్యదర్శుల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ ఇన్‌చార్జ్ కార్యదర్శి ఇన్‌చార్జి చౌడప్ప పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సాయిఆరామంలో ఆదివారం ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా చౌడప్ప, ప్రధాన కార్యదర్శిగా లోకేశ్, ఉపాధ్యక్షులుగా ప్రశాంతి, భార్గవ్, జాయింట్ సెక్రటరీగా బాలాజీ, సాదిక్, సభ్యులుగా ప్రకాష్, అశోక్, చంద్రశేఖర్, రవికాంత్, అంజలిని ఎన్నుకున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.35 (ఆదివారం సాయంత్రం)

సెహరీ : 4.59 (సోమవారం ఉదయం)

హనీట్రాప్

వాట్సాప్ కాల్‌తో పరిచయం... వీడియో కాల్‌తో బ్లాక్‌మెయిల్

అల్లుడి డైరెక్షన్‌లో అత్త వ్యవహారం.. వందల్లో బాధితులు

పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు

లేపాక్షి, మార్చి23(ఆంధ్రజ్యోతి): ఆమె వాట్సాప్ కాల్ చేస్తారు. తియ్యటి మాటలతో పరిచయం చేసుకుంటారు. ఆమె మాటలకు అటువైపు వ్యక్తి ఫిదా కావాల్సిందే. ఇలాగే కొద్దిరోజులు వ్యవహారం నడుపుతారు. తమ లైన్‌లోని వచ్చాడని నమ్మకం కుదిరాక వీడియో కాల్ చేసి మాట్లాడుతూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడతారు. ఇదంతా ఓ అల్లుడి డైరెక్షన్‌లో అత్త సాగిస్తున్న వ్యవహారం. అత్త హనీట్రాప్ చేయడం, అల్లుడు సెటిల్‌మెంట్ చేయడం.. ఇవీ లేపాక్షి పోలీసుల విచారణలో వెల్లడైన అంశాలు. వివరాల్లోకి వెళితే లేపాక్షి మండలం కొండూరుకి చెందిన ధనుంజయ కొంత కాలంగా తన అత్తతో పరిచయం లేని వ్యక్తులకు ఫోన్ చేయించి, హనీట్రాప్ చేసి డబ్బులు లాగుతున్నాడు. అయితే లేపాక్షికి చెందిన ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ నెల 17న కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతికత సాయంతో నిందితులను గుర్తించారు. ఇందులో కొండూరికి చెందిన అల్లుడు ధనుంజయతో పాటు హిందూపురం పట్టణానికి చెందిన అత్త, లేపాక్షి బీసీ కాలనీకి చెందిన రవికుమార్, కొండూరుకి చెందిన రమేష్‌ని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు.

వీడియో కాల్‌తో ..

హిందూపురం ప్రాంతంలో డబ్బున్న వారి నెంబర్ సేకరించి అత్త వాట్సాప్‌లో వాయిస్ కాల్ మాట్లాడుతుంది. అలా తరచూ కొద్ది రోజులు మాట్లాడుతుంది. ఈక్రమంలో అవతలి వ్యక్తిని రెచ్చకొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తుంది. ఈక్రమంలోనే అవతలి వ్యక్తి ఒక అడుగు ముందుకు వేశాడంటే వీడియో కాల్ ద్వారా ఎక్స్‌పోజింగ్ చేస్తుంది. ఆ వీడియోని అవతలి వ్యక్తికే స్క్రీన్ షాట్‌లు పంపి బ్లాక్‌మెయిల్ చేస్తుంది. డబ్బులు ఇవ్వలేదంటే సోషల్ మీడియాలో షేర్ చేస్తామని, బంధువులకు పంపుతామని బెదిరిస్తారు. చేసేది లేక అడిగినంత ఇచ్చు కోవాల్సిందే. హనీట్రాప్ డైరెక్షన్ అంతా అల్లుడు, అతడి బావ మరిదిదే. వారు చెప్పిన మేరకే స్క్రిప్ట్ ఉంటుంది. వారు చెప్పిన వ్యక్తిని ట్రాప్‌లోకి దింపుతుంది. వారు దిగారని తెలిసిన వెంటనే అవతలి వ్యక్తిని బ్లాక్‌మెయిల్ చేస్తారు.

వందల్లో బాధితులు?

హనీట్రాప్ విషయంగా పోలీసులకు ఫిర్యాదు చేసింది ఒక్కడే. ఎందుకంటే ధనుంజయ అనే వ్యక్తికి చాలా మంది భయపడతారు. అతడు గతంలో ఓ పత్రికలో పని చేయడమే కారణం. దీంతో పాటు ఆర్‌టీఐ కింద అధికారులను బెదిరించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఈ నేపథ్యంలో సమస్య ఎందుకని అడిగినంత ఇచ్చుకుంటు న్నారు. ఒక హిందూపురం నియోజకవర్గంలో వందల సంఖ్యలో వీరి బాధితులు ఉన్నారంటే హనీట్రాప్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ధనుంజయ గతంలో ఒక వీఆర్‌ఓని ఇంటికి పిలిపించుకొని లక్షల్లో డబ్బును గుంజారు. తాజాగా మరో వీఆర్‌ఓపై కన్నేశారు. వీరి బెదిరింపులకు తాళలేక ఒక వ్యక్తి మృతి చెందాడు. వీరు సుమారు. రూ. 4 కోట్ల వరకు గుంజినట్లు సమాచారం. ఫిర్యాదు చేయడానికి బాధితులు ఎవరూ ముందుకు రాలేదు. అందులో ఎక్కువ శాతం అధికారులే ఉండటం కారణం.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ


తోఫా అందజేస్తున్న అంబికా లక్ష్మీనారాయణ, షెక్షావలి

అనంతపురం కల్చరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లో ఉన్నవారితో సహా అందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం అని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని విశ్రాంత ఎస్పీ షెక్షావలి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని లలితకళా పరిషత్‌లో నిర్వహించిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతోపాటు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.5400కోట్లు కేటాయించారని అన్నారు. రంజాన్ పండుగను ప్రతిఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ.. ముస్లింలకు రంజాన్ తోఫా, దుల్హన్ ప థకం, మౌజాన్‌లు, ఇమామ్‌లకు గౌరవ వేతనాలు ప్రవేశపెట్టింది చంద్రబాబునాయుడేనని గుర్తు చేశారు. విశ్రాంత ఎస్పీ షెక్షావలి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆశాబేగం, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, వడ్డెర సంఘం మాజీ అధ్యక్షుడు దేవళ్ల మురళి, ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, సామాజిక కార్యకర్త జాకీర్, రాజకుల్లాయప్ప, అల్తాఫ్, మసూద్, ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ మాజీద్ పాల్గొన్నారు.

నయనమనోహరం.. శ్రీవారి పుష్పయాగం

ముగిసిన ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు


పుష్పయాగంలో శ్రీవారు

కదిరి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): శ్రీఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పుష్పయాగోత్సవం నయన మనోహరంగా సాగింది. ఉదయం ఆలయ సంప్రోక్షణ, శుద్ధి, పరివార దేవతల అభిషేకం, గోపూజ, హోమాది కార్యక్రమాలు చేశారు. అనంతరం యాగశాల నుంచి స్వామి వారి కుంభం, కలశాన్ని గర్భాలయం లోకి తీసుకొచ్చారు. మధ్యాహ్నం స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 12 రకాల పుష్పాలతో యాగోత్సవం నిర్వహించారు. స్వామివారు, భూదేవి, శ్రీదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలకంరించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి నిర్వహించిన పుష్పయాగోత్సవంతో ముగిశాయి. 15 రోజులపాటు అత్యంత వైభవంగా జరిగాయి. అంకురార్పణ నుంచి పుష్పయాగం వరకు ప్రతి ఉత్సవంలో శ్రీవారు భక్తులకు కనువిందు చేశారు.


స్వామివారి సేవకు తెప్పించిన పుష్పాలు

ఖాద్రీశుడి సన్నిధిలో జిల్లా ప్రధాన న్యాయాధికారి


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న న్యాయాధికారి

కదిరిలీగల్(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. స్థానిక న్యాయాధికారి జయలక్ష్మి, సిబ్బంది వెంట రాగా జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్.. స్వామివారి దర్శనానికి ఆదివారం వచ్చారు. న్యాయాధికారికి తూర్పురాజగోపురం వద్ద ఆలయ సహాయ కమిషనర్, సిబ్బంది స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయాధికారికి శ్రీవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేసి, దుశ్శాలువాతో సన్మానించారు. శ్రీవారి పుష్పయాగోత్సవంలో జిల్లాన్యాయాధికారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు విశ్రాంతి భవనం వద్ద గౌరవపూర్వకంగా స్థానిక న్యాయవాదులు.. జిల్లా న్యాయాధికారిని కలిశారు.





ఈదురుగాలుల బీభత్సం

తోడైన వడగళ్ల వాన.. భారీగా దెబ్బతిన్న ఉద్యాన పంటలు

అనంత జిల్లాలోనే రూ.34.91 కోట్ల నష్టం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి వీచిన ఈదురుగాలులకు పలు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఈ గాలులకు వడగళ్ల వాన తోడవడంతో నష్టం తీవ్రత పెరిగింది. ముఖ్యంగా అరటి, బొప్పాయి, దానిమ్మ, మొక్కజొన్న పంటలు బాగా దెబ్బతిన్నాయి. అక్కడక్కడ వేరుశనగ పంటకు నష్టం జరిగినట్లు రైతులు పేర్కొన్నారు. వడగళ్ల దెబ్బకు కాయలు నల్లగా మారడంతో అరటిని కొనేందుకు వ్యాపారులు ముందుకు రారని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కోత కోసే సమయంలో ఈదురు గాలులు తమ ఆశలను చెదరగొట్టాయని వారు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

అనంతపురం అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో 9 మండలాల్లో రూ.34.91 కోట్ల విలువైన ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. కోత దశలోని అరటి, బొప్పాయితోపాటు మామిడి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. పుట్లూరు, యల్లనూరు, యాడికి, శింగనమల మండలాల్లో అత్యధికంగా 557.20 హెక్టార్లల్లో రూ.34.82 కోట్ల విలువైన అరటి పంట దెబ్బతింది. 2 హెక్టార్లల్లో రూ.7.50 లక్షల విలువైన బొప్పాయి పంట, రూ.లక్ష విలువైన మామిడి పంట దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 559.60 హెక్టార్లల్లో రూ.34.91 కోట్లు విలువైన ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. యల్లనూరు, పుట్లూరు మండలాల్లో 35 హెక్టార్లలో రూ.30.09 లక్షల విలువైన మొక్కజొన్న దెబ్బతింది. భారీ ఈదురుగాలుల ప్రభావంతో కంకి ఏర్పడే దశలోని మొక్కజొన్న నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

ఫోన్‌లో పరామర్శించిన మంత్రి

ఈదురుగాలులకు నష్టపోయిన మండలంలోని పలువురు అరటి రైతులను రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఫోన్‌లో ఆదివారం పరామర్శించారు. అధికారుల నుంచి తగిన నివేదికలు తెప్పించుకుని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

335 ఎకరాల్లో పంట నష్టం

పుట్లూరు: మండలంలో శనివారం అర్ధరాత్రి గాలివానకు పెద్దఎత్తున ఉద్యాన పంటలతోపాటు మొక్కజొన్న పంట దెబ్బతింది. 300ఎకరాల్లో అరటి, 5ఎకరాల్లో బొప్పాయి, 26ఎకరాల్లో మొక్కజొన్న, 4ఎకరాల్లో మామిడిపంటలు నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. కుమ్మనమల, కొండుగారికుంట, రంగమనాయునిపల్లి, రంగరాజుకుంట, ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట, మడ్డిపల్లి, కడవకల్లు, ఓబులాపురం, చెర్లోపల్లి తదితర గ్రామాల్లో పంట నష్టం జరిగింది. చేతికి వచ్చిన పంట గాలివానకు దెబ్బతినడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రావని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల వడగళ్ల వాన పడటంతో అరటికాయలకు, ఆకులకు నల్లటి మచ్చలు పడ్డాయి. దెబ్బతిన్న పంటను వ్యాపారులు సగం ధరలకు కూడా కొనుగోలు చేయరని వాపోతున్నారు.

20 ఎకరాల్లో దెబ్బతిన్న వేరుశనగ

యాడికి(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నేపల్లి గ్రామంలో శనివారం కురిసిన వర్షానికి పలువురు రైతులు వేరుశనగ పంటను నష్టపోయారు. పిన్నేపల్లి గ్రామానికి చెందిన కొత్తరాయుడు, మరో ఆరుగురు రైతులు బోరుబావుల కింద వేరుశనగ సాగుచేశారు. శుక్ర, శనివారాల్లో పంటను కోశారు. వేరుశనగ కాయలు తొలగించక ముందే శనివారం రాత్రి అకాలవర్షం కురవడంతో తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు తెలిపారు. పిన్నేపల్లి గ్రామంలో సుమారు రూ.10లక్షల మేర వేరుశనగ పంట నష్టం జరిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.3 కోట్లకుపైగా..

తాడిమర్రి: మండలంలోని శనివారం రాత్రి వీచిన గాలులకు దాడితోట, తురకవారిపల్లి, నాయనపల్లి గ్రామాలలో అరటి, దానిమ్మ, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. 82 మంది అరటిరైతులకు సంబంధించి 77.50 హెక్టార్లలో అరటిపంట పూర్తిగా నేలమట్టమైంది. ఆరు హెక్టార్లలో మొక్కజొన్న, రెండు హెక్టార్లలో దానిమ్మ పంట పూర్తిగా దెబ్బతింది. తెల్లవారితే టన్ను రూ.17వేలతో పంట కోస్తారని ఎదురుచూసిన రైతుల ఆశలను ఈదురుగాలులు చెదరగొట్టాయి. దాదాపు రూ.3కోట్లకు పైగా నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు ఒక అంచనాకు వచ్చారు. స్థానిక తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్ రామాంజనేయులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి, నష్టం వివరాలు నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు పంపారు.

రైతులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల(ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా నియోజకవర్గంలోని చాలా మండలాల్లో పంటనష్టం వాటిల్లిందని, ప్రతి రైతును ఆదుకుంటామని శింగనమల ఎమ్మెల్యే శ్రావణిశ్రీ అన్నారు. పుట్లూరు, యల్లనూరు, శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, గార్లదిన్నె మండలాల్లో అరటితోపాటు ఇతర పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టంపై అంచనా వేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.


పుట్లూరు మండలంలో ఈదురుగాలులకు పడిపోయిన బొప్పాయి

28 ఎకరాల్లో అరటి పంట నష్టం

ముదిగుబ్బ: మండలంలోని చిత్రవాండ్లపల్లి, ఈదులపల్లి, ఇందుకూరు, కొడవాండ్లపల్లి గ్రామాలలో ఈదురుగాలుల దెబ్బకు అరటి పంట 28 ఎకరాలలో దెబ్బతిన్నట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు. దెబ్బతిన్న అరటి పంటను ఆదివారం అధికారులు పరిశీలించారు. గాలి బీభత్సానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.


నేలకొరిగిన అరటి గెలలను చూపుతున్న రైతు

తక్కువ ధరకు అడుగుతున్నారు



నాలుగు ఎకరాల్లో 5వేల అరటిచెట్లను సాగు చేశా. వాటిలో గాలివానకు 1500చెట్లు పడిపోయాయి. కిందపడిపోయిన కాయలను అతితక్కువ ధరకు అడుగుతున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడిపెట్టి ప్రస్తుతం ఉన్న ధరకన్నా ఇంకా సగం ధరకు అమ్మలేకున్నాం. కానీ గత్యంతరం లేక వ్యాపారులు అడిగిన ధరకే ఇస్తున్నాం. ప్రభుత్వమే వ్యాపారస్తులతో కొనుగోలు చేయిస్తే బాగుంటుంది.

\- జగదీష్, రైతు, రంగమనాయునిపల్లి

పూర్తిగా నష్టపోయా..



నేను నాలుగు ఎకరాల్లో 5500 అరటి చెట్లు సాగుచేశా. వాటిలో గాలివానకు 4800 చెట్లు పూర్తిగా పడిపోయాయి. వారంరోజుల క్రితం వ్యాపారులు టన్ను రూ.17వేలతో అడిగారు. అమ్ముదామనేలోగా గాలివానకు అరటితోట పూర్తిగా పడిపోయింది. ఇప్పుడు సగం ధరకు కూడా అడగరు. ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యం.

\-ఆదినారాయణరెడ్డి, రైతు, రంగరాజుకుంట

తెల్లారితే డబ్బు వస్తుందనుకున్నా..



సోమవారం అరటి పంటకు డబ్బులు వస్తాయి. మందుల అంగడిలో ఉన్న అప్పులు కట్టి ఇంటిఖర్చుల కోసం చేసిన అప్పులు తీరుతాయని అనుకున్నా. కానీ పూర్తిగా నష్టపోయా, ఈదురుగాలికి పడిపోయిన పంటను ఎవరు కొనేందుకు ముందుకురారు. దీంతో అరటిగెలలను గొర్రెలు, మేకలకు ఇచ్చుకోవాల్సిందే కానీ కొనడానికి ఎవరు ముందుకురారు.

\-నరేశ్, రైతు, తురకవారిపల్లి

కాలేజీ ఫీజుకు వస్తుందనుకున్నా..



నా కుమారుడు పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. ఇంటర్‌కు ఫీజులు కట్టేందుకు అరటి పంట ద్వారా డబ్బులు వస్తాయనుకున్నా. పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చుకోవాలనుకున్నా. కానీ అవేవి జరగకుండానే పంట పూర్తిగా దెబ్బతింది. ఈ రోజు ఉదయం ఫోన్‌చేసి గెలలు ఈ రోజే తీసుకెళ్లాలని వ్యాపారులను కోరితే ఆ పంట మాకొద్దు ఇచ్చిన అడ్వాన్స్ కూడా వెనక్కి ఇవ్వాలని అడుగుతున్నారు.

\- భక్తవత్సలంనాయుడు, రైతు, తురకవారిపల్లి

17 మందిపై కేసు

తాడిపత్రి, మార్చి23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్నబజారులో వైసీపీ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా ఇంటివద్ద రెండురోజుల కిందట టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య దాడులకు సంబంధించి ఆదివారం 17మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. దాడుల్లో గాయపడ్డ టీడీపీ మద్దతుదారుడు వరుణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైసీపీ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా, డీవీకుమార్, ఆర్‌సీ ఓబులరెడ్డి, చవ్వా రాజశేఖర్‌రెడ్డి, గూడూరు లక్ష్మీరంగయ్యతోపాటు మరో 12మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడి

గార్లదిన్నె, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపేట సమీపంలోని ఓ చీనీ తోటలో నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రంపై ఆదివారం పోలీసులు దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు.. తిమ్మంపేటకు చెందిన బాబు అనే వ్యక్తి వివిధ ప్రాంతాల నుంచి మహిళలను తీసుకువచ్చి గ్రామ సమీపంలో ఓ చీనీ తోటలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారంతో ఎస్‌ఐ మహమ్మద్ గౌస్‌బాషా.. సిబ్బందితో కలిసి వ్యభిచారం కేంద్రంపై దాడి చేశారు. వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్న బాబుతో పాటు ఓ మహిళను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిరుధాన్యాలపై జీఎస్టీ రద్దు చేయాలి

-శాస్త్రవేత్త ఖాదర్‌వలి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలపై జీఎస్టీ రద్దు చేయాలని, కనీస మద్దతు ధర నిర్ణయించాలని స్వతంత్ర శాస్త్రవేత్త ఖాదర్‌వలి డిమాండ్ చేశారు. స్వచ్ఛంద సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో కలిసి అనంత సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజులపాటు సాగే చిరుధాన్యాల మేళా (మిల్లెట్ ఫెస్టివల్) ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా స్వతంత్ర శాస్త్రవేత్త ఖాదర్‌వలి 'చిరుధాన్యాలతో ఆరోగ్యం' అనే అంశంపై మాట్లాడుతూ...ఎరువుల సబ్సిడీలు ఇచ్చే విధానం, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ బియ్యం పంపిణీతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందన్నారు. మిల్లెట్లపై జీఎస్టీ ఎత్తివేయాలని, 10రకాల చిరుధాన్యాలకు కనీస మద్దతు ధర నిర్ణయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏపీ మిల్లెట్స్ రీసెర్చ్ చీఫ్ చంద్రమోహన్‌రెడ్డి, నాబార్డు డీడీఎం అనురాధ, సీసీడీ వ్యవస్థాపక కార్యదర్శి త్రిలోచన్ శాస్త్రి, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయ వేదిక సభ్యులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం సాయంత్రం	సహర్ మంగళవారం ఉదయం
కదిరి:	6.31	5.03
ధర్మవరం:	6.36	5.02

న్యూస్ బాక్స్

బీఎస్పీ మహిళా నేతకు చేయూత

ధర్మవరం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న బహుజన సమాజ్ పార్టీ మహిళా నేతకు ఆ పార్టీ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. షుగర్ వ్యాధి ఎక్కువ కావడంతో ఆమె కాలు తొలగించారు. ఆమె వైద్య ఖర్చులకు నిమిత్తం జిల్లా బీఎస్పీ కమిటీ తరపున రూ.5 వేలు, ఎమ్మార్పీఎస్ నాయకులు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు ఎస్ రాయుడు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాకే వినయ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు సాకే ఆంజనేయులు,కె. వెంకటేశ్, పాల్గొన్నారు.

ఓర్వలేకే.. ఆరోపణలు

ధర్మవరం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఓర్వలేని తనంతోనే తనపై ఆరోపణలు చేశారని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పోలా లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాను సీపీఐ, చేనేత కార్మిక సంఘం తరపున చేపట్టిన కార్యక్రమాల్లో ప్రజల, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు సహకారం అందించానన్నారు. సీపీఐ నుంచి తనను తొలగించినట్టు ప్రకటించడం బాధాకరమన్నారు.

రేపు దుకాణాల వేలం

తనకల్లు, మార్చి23(ఆంధ్రజ్యోతి): తనకల్లు మేజర్ పంచాయతీ వారపు సంతలో దుకాణాలను మంగళవారం వేలం వేస్తున్నట్లు కార్యదర్శి క్రిష్ణమూర్తిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో పాల్గొనేవారు రూ.పదివేలు ధరావత్తు చెల్లించాలని సూచించారు.

● 26న తలుపులలో...

కదిరి: తలుపుల గ్రామ పంచాయతీలో నిర్వహించే వారపు సంతను బుధవారం వేలం వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ. 50వేలు ధరావత్తు చెల్లించాలని, వేలం దక్కుకున్నవారు 29న మొత్తం చెల్లించాలని అన్నారు. పూర్తి వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ధర్మపురిలో వైద్య శిబిరం

ధర్మవరంరూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మపురిలో ఆర్డీటీ విన్సెంట్ ఫెర్రర్ జ్ఞాపకార్థం ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో వైద్యులు సాహిద్, మనోజ్‌కుమార్, రమ్య, నాగరాజు సుమారు 70 మంది ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యశిబిరం క్యాంపు కన్వీనర్ సత్య నిర్ధారణ, యువర్స్ ఫౌండేషన్ నాగేంద్ర, కేతలోకేష్ పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

గాండ్లపెంట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం జరగాల్సిన సర్వసభ్య సమావేశాన్ని కోరం లేక మళ్లీ వాయిదా వేసినట్లు ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి తెలిపారు. కోరం లేకపోవడంతో శనివారం జరగాల్సిన సర్వసభ్య సమావేశాన్ని ఆదివారానికి వాదా వేశామని, ఆదివారం కూడా ఎంపీటీసీ సభ్యులు హాజరుకాకపోవడంతో మళ్లీ వాయిదా వేసినట్లు చెప్పారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

నల్లమాడ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక మేదరవీధిలో నెలకున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చంద్ర ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. రెండు నెలలుగా మేదర వీధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని అన్నారు. దీంతో ఆ కాలనీవాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పక్కవీధులలోకెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. మూడు రోజుల క్రితం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందచేశామని, అధికారులు స్పందించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

బెట్టింగ్ ఆడితే కఠిన చర్యలు

బత్తలపల్లి మార్చి 23(ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ ప్రభాకర్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం 18వ ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నాయని, బెట్టింగులకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

ఇరువర్గాల ఘర్షణ

ధర్మవరంరూరల్, మార్చి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుకుంటలో ఆదివారం ఇరువర్గాలు ఘర్షణ పడటంతో.. వారిపై కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో బృందావనం కాలనీ వద్ద సర్పంచ్ భర్త అంగజాల రాజు, జయరాంతో పాటు పలువురు ఎక్స్‌కవేటర్ సాయంతో రోడ్డుపక్కన ఆదివారం కంపచెట్లు తొలగించసాగారు. ఎందుకు కంపచెట్లు తొలగిస్తున్నారని కేశవయ్య అనే వ్యక్తి ప్రశ్నించడంతో పాటు దురుసుగా మాట్లాడారు. దీంతో ఇరువర్గాలు ఘర్షణపడ్డాయి. దీనిపై విచారణ చేసి అంగజాల రాజు, జయరాంతో పాటు మరో ఆరుగురిపై, మరో వర్గానికి చెందిన కేశవయ్యతో పాటు మరో ముగ్గురిపై కేసులు నమోదు చేశామన్నారు.

ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు

కదిరి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక షాలీమార్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.. ముస్లింలకు ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మౌలానా షమీవుల్లా, షహీమీరియా సాహెబ్, మైనార్టీ నాయకులు ఫర్వీనాభాను, డైమండ్ ఇర్ఫాన్, బాహుద్దీన్, అల్హాముస్తఫా, టీడీపీ పవన్ కుమార్‌రెడ్డి, క్రిష్ణమోహన్‌నాయుడు, జనసేన శివశంకర్, ఆర్డీఓ వీవీఎస్ శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామి, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

● మున్సిపల్ కార్మికులకు...

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా 15 రోజులపాటు అవిశ్రాంతంగా పనిచేసిన మున్సిపల్ కార్మికులకు ఎమ్మెల్యే ఆదివారం విందు ఏర్పాటు చేశారు. స్థానిక వాటర్ ట్యాంక్ వద్ద కార్మికులకు ఈ విందు ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ,, బ్రహ్మోత్సవాలు నిర్వహించిన 15 రోజులూ మున్సిపల్ కార్మికులు పగలు, రాత్రి పనులు చేశారన్నారు.



ముస్లింలతో కలిసి ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

అసౌకర్యాల సంత

ఏటా ముదిగుబ్బ పంచాయతీకి భారీ ఆదాయం

వసతుల కల్పనపై పాలకులు, అధికారుల నిర్లక్ష్యం

ముదిగుబ్బ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్థానికంగా నిర్వహించే వారపు సంతలో కనీస సౌకర్యాలు లేక వ్యాపారులు, రైతులు, స్థానికులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ముదిగుబ్బలో ప్రతి శుక్ర వారం వారపు సంత నిర్వహిస్తారు. ఈ సంతకు మండలంలోని గ్రామాలతో పాటు.. బుక్క పట్నం, బత్తలపల్లి, కదిరి మండలంలోని పలు గ్రామాల ప్రజలూ వందల సంఖ్యలో వస్తారు. జాతీయ రహదారికి ఆనుకొని వారపు సంత నిర్వహిస్తుండడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. చుట్టుపక్కల మండలాల్లో రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయలను ఇక్కడ విక్రయిస్తారు. కూరగాయలతో పాటు వంట సామగ్రి, ఆకుకూరలు, పండ్లు ఇతర వస్తువులను ఈ సంతలో విక్రయిస్తుంటారు. కూరగాయల సంత, గొర్రెల సంత వేలం పాట ద్వారా పంచాయతీకి ఏటా రూ. లక్షల్లో ఆదాయం వస్తోంది. అయినా ఈ సంతలో నీరు, నీడ, మరుగుదొడ్లు.. తదితర కనీస వసతులూ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వానకు తడుస్తూ.. ఎండాకాలంలో ఎండకు ఎండుతూ.. వ్యాపారులు, రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రస్తుతం ఎర్రటి ఎండలో రహదారిపైనే వ్యాపారులు ఈ సంతను నిర్వహిస్తున్నారు. వేసవి కాలంలో కనీసం చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేయలేదు. సంత వేలం పాటలో గత ఏడాది కంటే ఈ ఏడాది రూ. నాలుగు లక్షలు అధికంగా పంచాయతీకి ఆదాయం వచ్చింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు వారపు సంతపై ప్రత్యేక దృష్టి సారించి.. ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఎండలోనే నిర్వహిస్తున్న పశువుల సంత

వసతులు కల్పిస్తాం



ప్రజలకు చలివేంద్రాలు, పశువులకు నీటి తొట్టెలు ఏర్పాటు చేయిస్తాం. వారపు సంతలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం.

-ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దివాకర్, ముదిగుబ్బ

వసతులు కల్పించాలి



చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి మహిళలు, రైతులు వస్తుంటారు. నీడ లేక.. తాగునీరు దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు మండుతుండటంతో తాగునీరు దొరక్క అనేక పాట్లు పడుతున్నారు. సంబంధిత పాలకులు, అధికారులు వారపు సంతలో కనీస వసతులు కల్పించాలి.

- వెంకటరాముడు, నల్లచెర్లోపల్లి

పట్టించుకోవడం లేదు



వారపు సంతలో సమస్యలు తిష్ట వేశాయి. ఆ సమస్యలపై గతంలో సంబంధిత అధికారులకు అనేక మార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. వాటిని పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. వారపు సంతలో మూగ జీవాలకు నీడ సౌకర్యం, నీటి తొట్టెలు, ప్రజలకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి.

-చల్లా శ్రీనివాసులు, సీపీఐ మండల కార్యదర్శి

ఆదివారం ఆస్పత్రికి సెలవా..?

- సమయపాలన పాటించని సిబ్బంది
- డాక్టర్ అలా వచ్చారు.. ఇలా వెళ్లారు..
- స్టాఫ్ నర్సే దిక్కు

ఆంధ్రజ్యోతి పరిశీలన

తనకల్లు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తనకల్లు మండలానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొక్కంటిలో ఉంది. ఈ కేంద్రంలో పనిచేసే సిబ్బంది సమయ పాలన పాటించదు. ఇక ఆదివారం వస్తే.. వైద్యుడు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ అసలు విధులకే రారనే ఆరోపణలున్నాయి. ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సులు మాత్రమే విధుల్లో ఉంటారు. ఈ ఆదివారం డాక్టర్ ధర్మరాజు ఇలా వచ్చారు... ప్రసవం చేశారు.. అలా వెళ్లిపోయారు... ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ అసలు విధులకే రాలేదు. ఇక స్టాఫ్‌నర్సే అంతా తామై వైద్య సేవలు అందిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని రోగులు వాపోతున్నారు. ఈ లోపం కారణంగా గ్రామాల్లోని ఆసుపత్రుల్లోని కిందిస్థాయి సిబ్బందీ.. విధులను నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి.. ప్రజలకు సక్రమంగా.. నిత్యం వైద్య సేవలు అందు బాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ గది



వైద్యం చేస్తున్న స్టాఫ్‌నర్స్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఆరోపణలున్నాయి. ఈ ఆదివారం విధులకు డుమ్మా కొట్టారు. డాక్టర్ కూడా ఇలా వచ్చి.. అలా వెళ్లారు... కేవలం స్టాఫ్‌నర్స్ మాత్రమే అందుబాటులో ఉంటోంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే, డీఎంహెచ్‌ఓ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకొని వెళ్తా. గ్రామాల్లో వైద్యసేవలు సక్రమంగా అందేలా కృషి చేస్తా.

-సోంపాళ్యం నాగభూషణం, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు

ఉత్తమ ఆయుష్మాన్ మందిర్

తాడిమర్రి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిమాకులపల్లి (చిన్నచిగుళ్లరేవు) ఆయుష్మాన్ మందిరానికి ఉత్తమ అవార్డు దక్కింది. గతనెల 23న జాతీయ ఆరోగ్య మిషన్ బృందం సమన్వయ కర్త సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మర్రిమాకులపల్లిలో అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరాతీశారు. పనితీరు, సేవల ఆధారంగా 92.12 శాతం మార్కులు రావడంతో అవార్డుకు ఎంపిక చేసినట్లు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రేణుక, హర్షవర్ధన్ తెలియజేశారు. ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.



ఆయుష్మాన్ భవనం వద్ద సిబ్బంది

హత్యాయత్నం కేసులో 8మంది అరెస్టు

గోరంట్ల, మార్చి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంగారెడ్డిపల్లి వద్ద భూ వివాదానికి సంబంధించి ఇరువర్గాలు మరణాయుధాలతో దాడి చేసుకున్న సంఘటనపై ఆదివారం 8మందిని అరెస్టు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. వారి నుంచి రెండు కొడవళ్లు, ఇనుప పైపు, రాళ్లు, స్వాధీనం చేసుకున్నామన్నారు. కాంగారెడ్డిపల్లికి చెందిన రంగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హిందూపురం టీచర్స్‌కాలనీకి చెందిన రాజశేఖర్‌రెడ్డి, కాంగారెడ్డిపల్లికి చెందిన బయప్పరెడ్డి, నరేంద్రరెడ్డిలపై హత్యయత్నం కేసును శనివారం నమోదు చేశారు. హిందూపురం టీచర్స్‌కాలనీకి చెందిన రాజశేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కాంగారెడ్డిపల్లికి చెందిన అశ్వత్థరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, రంగారెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారు. వీరిరువు భూవివాదానికి సంబంధించి దాడులు చేసుకున్నారు. వారి ఫిర్యాదుల మేరకు రెండు హత్యాయత్నం కేసులు నమోదు చేశామన్నారు. నిందితులు 8 మందిని పెనుకొండ కోర్టుకు హాజరు పరిచామని సీఐ తెలిపారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



కదిరి : భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

కదిరిఅర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ వర్ధంతిని స్థానిక ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ స్మిత మాట్లాడుతూ.. స్వాతంత్ర పోరాటంలో భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, సుఖ్‌దేవ్, రాజ్‌గురు తదితర వందలాది మంది తృణప్రాయంగా ప్రాణాలు అర్పించారని, వారి సిద్ధాంతాలను నేటి యువత అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు చెన్నారెడ్డి, డాక్టర్ హైదర్‌వలీ, శంకర్, నస్రీన్, రవీంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

● ధర్మవరం : స్థానిక సీపీఎం కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, మండల కో కన్వీనర్లు అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, హైదర్‌వలీ, సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్ బాషా పాల్గొన్నారు. అలాగే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి సకల రాజా, పట్టణ కార్యదర్శి సునీల్, గోవర్ధన్, బార్గవ్ భగత్‌సింగ్‌కు నివాళులర్పించారు.

● కదిరి (తలుపుల) : తలుపులలోని మూడు రోడ్ల కూడలిలో ఆదివారం భగత్‌సింగ్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఎద్దు రాముడు, అంజన్‌బాబు, ఈశ్వరయ్య, రమణ, అంజి, చంద్ర, రాజు పాల్గొన్నారు.

రేపు చలో కలెక్టరేట్ : సీపీఎం

కొత్తచెరువు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజలు, రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని సీపీఎం జిల్లా కార్య వర్గసభ్యుడు ఎస్ వెంకటేశ్, సీనియర్ నాయకుడు రామకృష్ణ తెలిపారు. ఆదివారం వారు స్థానికంగా మీడియాతో మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు 12 వారాల నుంచి కూలి డబ్బులు మంజూరు చేయడం లేదని, రైతులకు సబ్సిడీ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు కాకుండా కాలువ వెడల్పు పనులు చేపట్టాలని కోరారు. ఇలా పలు సమస్యలు పరిష్కరించాలని మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి, మండల కార్యదర్శి సాకే ముత్యాలు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి వెంకటేశ్, కళాకారుల సంఘం కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్ : ప్రజాసమస్యల పరిష్కారం కోసం మంగళవారం కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జీఎల్ నరసింహులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని, అర్హులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామమోహన్, జగన్మోహన్, ముస్తాక్, అంజి, బాబ్‌జాన్, ఉదయ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు : కలెక్టరేట్ వద్ద మంగళవారం చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, వీవీ రమణ పేర్కొన్నారు. స్థానికంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. మండలంలోని ఆకుతోటపల్లి వద్ద జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అమడగూరు, ఓడీసీ, నల్లమాడ మండలాల్లో చెరువులకు హంద్రీనీవా నీరు ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, రైతు సంఘం రామిరెడ్డి, రామాంజి, బాషా, నరసింహులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిరసన

ముందస్తు నోటీసులపై గ్రామస్థుల ఆగ్రహం



అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

గాండ్లపెంట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులవారిపల్లి పెద్దతండా అంగన్‌వాడీ కేంద్రం వద్ద గ్రామస్థులు శనివారం అర్ధరాత్రి నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు కోసం నలుగురు దరఖాస్తు చేసుకున్నారు. అందులో శోభారాణిని ఈనెల 18న నియమించారు. శోభారాణి తనతోపాటు దరఖాస్తు చేసుకున్నవారు తన విధుల్లో ఏమైన ఇబ్బందులు కలిగిస్తారని భావించి.. కోర్టు నుంచి మిగిలిన ఆ ముగ్గురు దరఖాస్తుదారులకు ముందస్తు నోటీసులు పంపించింది. ఇలాంటి నోటీసులు తాము ఎప్పుడూ చూడలేదని, తమను భయభ్రాంతులకు గురిచేసేందుకే ఇలా నోటీసులు పంపారని ఆ దరఖాస్తుదారులు వాపోయారు. దీంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు శనివారం రాత్రి ఆ అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. ఇలాంటి అంగన్‌వాడీ కార్యకర్త తమకు వద్దన్నారు.

సమస్యల చీకట్లో.. వెలుగు కార్యాలయం

కనీస సౌకర్యాలు లేని స్త్రీశక్తి భవనం

ఓబుళదేవరచెరువు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డివారిపల్లి వద్ద ఉన్న స్త్రీశక్తి భవనంలో (వెలుగు కార్యాలయం) కనీస సౌకర్యాలు లేకపోవడంతో మహిళలు కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. స్త్రీశక్తి భవనాన్ని 2015లో నాటి మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 1,110 సంఘాలు, 40 గ్రామైక్య సంఘాలు, 40 మంది యానిమేటర్లు ఉన్నారు. ప్రతి నెలా యానిమేటర్లతో పాటు, మండల కార్యవర్గ సమావేశాన్ని ఈ భవనంలో నిర్వహిస్తూ ఉంటారు. స్త్రీశక్తి భవనంలో రెండు మరుగుదొడ్లు ఉన్నా.. నీటి సౌకర్యం లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ ముళ్లకంపలు ఉండటం.. ఈ భవనానికి ప్రహరీ లేకపోవడంతో విషపురుగులు భవనంలోకి వస్తుంటాయి. ఐదేళ్లలో వైసీపీ పాలనలో ఈ సమస్యల గురించి ఏమాత్రం పట్టించుకోలేదు.



ఓడీసీ స్త్రీశక్తి భవనం

అధికారులు స్పందించాలి



కార్యాలయంలో నెలకున్న సమస్యలపై అధికారులు స్పందించాలి. మురుగుదొడ్లు లేకపోవడంతో.. సమావేశాలు జరిగినప్పుడు మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి సౌకర్యం కల్పించాలి.

-వెంకటలక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షురాలు

నీటి సౌకర్యం కల్పించాలి



కార్యాలయం ఆవరణంలో బోరు వేశారు. అందులో నీరు లేవు. అదనంగా మరో బోరు వేసి నీటి సమస్యను పరిష్కరించాలి. నీటి సౌకర్యం లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయానికి ప్రహరీని కూడా నిర్మించాలి.

-లక్ష్మీదేవి, మండల సమాఖ్య కార్యదర్శి

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

తాగునీరు, ప్రహరీ, ఇతర సమస్యలను గతంలోనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరోసారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తాం.

-రవీంద్ర, ఏరియా కో-ఆర్డినేటర్

సంక్షేమ హాస్టల్‌లో ఫ్యాన్ల ఏర్పాటు



మిట్టపల్లి బీసీ వసతి గృహంలో ఏర్పాటు చేసిన ఫ్యాన్లు

ఓబుళదేవరచెరువు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఎండకాలంలో వసతి గృహాల్లో ఫ్యాన్లు లేకపోవడంతో ఉక్కపోతతో విద్యార్థులు అల్లాడిపోతున్నారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి సంక్షేమానికి సన్‌స్ట్రోక్ పేరు తో ఓ వార్తను మూడు రోజుల క్రితం ప్రచురించింది. ఈవార్తకు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మలాజ్యోతి, ఏబీసీ డబ్ల్యూఓ బాలాజీ స్పందించారు. మండలంలోని మిట్టపల్లి బీసీ వసతి గృహంలో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని వార్డెన్ రవీంద్రనాథ్‌రెడ్డిని ఆదేశించారు. దీంతో ఆదివారం ఆ వసతి గృహంలో ఫ్యాన్లు ఏర్పాటు చేశారు.

న్యూస్ బాక్స్

ఆటోనగర్‌లో పోలీసు తనిఖీలు


ఆటోనగర్ ప్రజలతో మాట్లాడుతున్న సీఐ

హిందూపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లో పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఆటోనగర్ కాలనీలో రికార్డులు లేని 12 ద్విచక్రవాహనాలు, మూడు ఆటోలు, కర్ణాటక మద్యం పట్టుబడిందన్నారు. ఈ సందర్భంగా సీఐలు జనార్దన్, అబ్దుల్ కరీం మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, సహకరించినా చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. దాడుల్లో ఎస్ఐ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులు సాధించుకుందాం

బహుజన చైతన్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెనుకొండ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కలిసికట్టుగా ఉంటూ హక్కులు సాధించుకుందామని బహుజన చైతన్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో బహుజన చైతన్య వేదిక నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటత్లాడుతూ ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జైభీమ్ ర్యాలీ నిర్వహించాలన్నారు. హక్కులు, ఐక్యతను కోరుతూ ర్యాలీ సాగాలన్నారు. ర్యాలీలో అందరూ పాల్గొనాలని సూచించారు. అనంతరం ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో నాయకులు త్రిపుర రిసార్ట్ గోపీనాథ్, బాబుప్రసాద్, రామాంజినప్ప, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హంస కమిటీ ఎన్నిక


ఎంపికైన కమిటీ

సోమందేపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): హంస పెనుకొండ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సోమందేపల్లి మండల కేంద్రంలో వైద్య ఆరోగ్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు షఫీ, కార్యదర్శి వేణుగోపాల్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా అనీల్‌కుమార్, కార్యదర్శిగా కేశవయ్య, కోశాధికారిగా రత్నమ్మ, అసోసియేట్ అధ్యక్షునిగా గిరినాథ్‌రావు, ఉపాధ్యక్షులుగా తనూజ, సుబ్బలక్ష్మీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అనీల్‌కుమార్ మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్షునిగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెనుకొండ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మందకృష్ణ మాదిగకు ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటమన్నారు. చివరికి వర్గీకరణ ఆకాంక్ష తీరిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి శివకుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, పోతులయ్య, డాక్టర్ గోపీనాథ్, ఎంఈఎఫ్ అధ్యక్షులు నాగరాజు, ఉపాధ్యక్షులు ఈశ్వరప్ప, ప్రధాన కార్యదర్శి శివకుమార్, దండోర రామాంజినేయులు, శివశంకర్, గోవిందు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి

రొళ్ల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఓ మునవర్‌జాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-2026 విద్యా సంవత్సరానికి 6-11తరగతిలో ప్రవేశానికి, 6, 7, 8, 9, 10, 12 తరగతులలో మిగిలిన ఉన్న సీట్ల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 11వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కొండూరు చెరువుకు కృష్ణాజలాలు


కృష్ణాజలాలతో కళకళలాడుతున్న చెరువు

లేపాక్షి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కొండూరుచెరువుకు కృష్ణాజలాలు వచ్చాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కృష్ణాజలాలు రాకపోవడంతో మండల పరిధిలోని చెరువులన్నీ అడుగంటాయి. ప్రస్తుతం ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి చెరువులన్నీ కృష్ణాజలాలతో నింపాలని భావించింది. దీంతో రెండు రోజుల నుంచి కృష్ణాజలాలు కొండూరు చెరువుకు రాసాగాయి. ఇప్పటికే చెరువు సగం నిండగా మరో రెండు రోజుల్లో పూర్తిగా నిండనుంది. దీంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఆదాయం ఉన్నా.. వసతులు సున్నా..

సొంత భవనానికి నోచుకోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వారికి తప్పని తిప్పలు

72 ఏళ్లు కావస్తున్నా అరకొర సౌకర్యాలే


చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

చిలమత్తూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వానికి పెద్ద ఆదాయ వనరు అంటే టక్కున గుర్తుకొచ్చేది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం. ఈ కార్యాలయం 1953 నుంచి ఇక్కడ ఉంటోంది. ఆనాటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వంతోపాటు మండల పరిధిలోని గ్రామ పంచాయతీలకు కొంత వరకు ఆదాయం సమకూర్చుతోందనడంలో సందేహం లేదు. అయితే ఒకప్పుడు వేలల్లో ఉంటున్న ఆదాయం ఇప్పుడు లక్షలు దాటి కోట్ల వరకు మారింది. ప్రతి ఏడాది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఆదాయం అంచెలంచెలుగా పెరుగుతూనే ఉంది.

ఆదాయం ఉన్నా..

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి కోట్లలో ఆదాయం వస్తున్నా కార్యాలయానికి సొంత భవనం లేదు. కార్యాలయం ఏర్పాటుచేసినప్పటి నుంచి ఇప్పటివరకు సొంత భవనం లేకుండా పోయింది. వసతులు లేని అద్దె భవనంలోనే కార్యకలాపాలు జరుగుతున్నాయి. రోజు వందలాది మంది కార్యాలయానికి వచ్చి పనులు పూర్తీ చేసుకొని వెళుతుంటారు. ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో రోజు కార్యాలయానికి వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే వసతులు ఏమాత్రం లేకపోవడంతో క్రయ, విక్రయాలు సాగించేవారు ఇబ్బందులకు గురవుతున్నారు. భవన ప్రాంగణంలో కూర్చోవడానికి సరైన స్థలం లేకపోవడం విశేషం. భవనం లోపల కూడా ఇరుకుగా ఉండటంతో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేయించడం కష్టంగా ఉంటోంది. అంతేకాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు వాహనాల్లో వస్తుంటారు. కార్యాలయం వద్దకు వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో వారు నడిరోడ్డుపైనే వాహనాలను ఆపాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తుతోంది.

కష్టమవుతున్న డాక్యుమెంట్ల భద్రత

1953 నుంచి ఇప్పటి వరకు రికార్డులను భద్రపర్చడం సిబ్బందికి తల ప్రాణం తోకకు వస్తోంది. ఇరుకైన భవనంలోనే ఎంతో జాగ్రత్తగా పాత రికార్డులను భద్రపర్చుకున్నారు. రోజురోజుకి రికార్డులు పెరుగుతున్న నేపథ్యంలో ఎన్నో ఏళ్లుగా రికార్డుల భద్రత సిబ్బందికి కష్టంగా మారుతోంది.

ఏళ్లు గడిచినా సొంత భవనం లేదు

చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో చిలమత్తూరు, లేపాక్షి, గోరంట్ల, సోమందేపల్లి మండలాలు ఉన్నాయి. వందల సంఖ్యలోనే ప్రతి రోజూ రిజిస్ట్రేషన్ల కోసం, ఇతర డాకుమెంట్ల కోసం కార్యాలయానికి వస్తుంటారు. అయితే ఇప్పటి దాకా కార్యాలయానికి సొంత భవనం నిర్మించలేకపోయారు. గతంలో కార్యాలయ నిర్మాణానికి మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో స్థలం కేటాయించినా భవన నిర్మాణానికి మాత్రం ప్రభుత్వాలు ముందుకు రాలేదు. దాంతో కొత్త భవన నిర్మాణం అనేది కలగానే మిగిలి పోయింది. ఇప్పటికైనా కార్యాలయానికి సొంత భవనం ఏర్పాటైతే రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి అవకాశం ఉంటుంది.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం

బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత


చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి, చేనేతలు

సోమందేపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని, సీఎం చంద్రబాబునాయుడు సారథ్యంలో అభివృద్ధి పరుగులు తీస్తుందని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం సోమందేపల్లి మండల కేంద్రంలో రూ.1.50కోట్లతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైనేజీ, కల్వర్టు పనులను ఆమె ప్రారంభించారు. స్నేహలతనగర్, ద్వారకామయినగర్, సప్తగిరికాలనీ, సాయినాగర్‌లో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైనేజీలు ప్రారంభించారు. గీతానగర్‌లో రూ.20లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ భవిష్యత్తులో రూ.50లక్షలతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల రాష్ట్రం అప్పులపాలైందన్నారు. తమ ప్రభుత్వం అమరావతి, పోలవరం నిర్మించి రాష్ట్రాన్ని పురోభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషిచేస్తుందన్నారు. సోమందేపల్లిలో గతంలో ఎన్నడూలేనివిధంగా తాగునీటి సంక్షేమ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. దాదాపు అన్ని రోడ్లు పూర్తీచేశామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామన్నారు. మే నుంచి తల్లికి వందనం అలాగే అన్నదాత సుఖీభవ అందిస్తున్నట్లు వివరించారు. త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ ఉంటుందన్నారు. చేనేతలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. 50ఏళ్లు నిండిన చేనేతలకు రూ.4వేలు పింఛన్, ఆరోగ్యబీమా పథకం అమలు చేస్తామన్నారు

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

చేనేతలకు ఉచిత విద్యుత్‌ను అందజేస్తున్నందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి చేనేతలు మంత్రితో కలిసి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ కష్టాలను గుర్తెరిగి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంత్రి సవిత సీఎం రిలీఫ్ ఫండ్ కింద 45 మందికి మంజూరైన రూ.39,84,000 చెక్కులను బాధితులకు అందజేశారు. వికలాంగులకు మంజూరైన పది ట్రైసైకిళ్లను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె వాటిని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు డీవీ ఆంజనేయులు, నీరుగంటి చంద్ర, సిద్ధలింగప్ప, వడ్డె నూరి, వెంకటేశులు, వెంకటరాముడు, హరిక్రిష్ణ, సూర్యనారాయణ, కిష్టప్ప, సీనీహరి, ఉప్పర బాబయ్య పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

పెనుకొండ టౌన్(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలానికి చెందిన 30మంది బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ కండువాలువేసి మంత్రి పార్టీలో ఆహ్వానించారు. గోరంట్ల మండలం మందలపల్లి పంచాయతీకి చెందిన రామచంద్రరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, బండి వెంకటరెడ్డి, వడ్డె లక్ష్మీనారాయణ, వడ్డె వెంకటేశ్, విక్రంరెడ్డి, విజయ్‌కుమార్, వడిగేపల్లి పంచాయతీ, గోరంట్ల మేజర్ పంచాయతీ నుంచి తదితరులు చేరారు. వీరంతా వైసీపీ నుంచి టీడీపీలో చేరినట్లు తెలిపారు.

శాంతికి ప్రతీక సంత్ సేవాలాల్

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక సంత్ సేవాలాల్ మహారాజ్ అని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని షిరిడీ సాయినాథుడి దేవాలయ ఆవరణంలో జరిగిన జయంతి ఉత్సవాల్లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ అడుగు జాడల్లో అందరూ నడిచి శాంతి సౌభ్రాతృత్వానికి, సమాజంలో అసమానతలను తొలగించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

మడకశిరటౌన్, (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు సంజీవిని లాంటిదని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకొన్న 38 మందికి రూ.18లక్షల చెక్కులను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గం అభివృద్ధిపై అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందన్నారు. ఏప్రిల్ మొదటివారంలో విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్ మడకశిర నియోజకవర్గంలో పర్యటించి సబ్‌స్టేషన్లను ప్రారంభించడం జరుగుతుందన్నారు. క్రీడాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఏప్రిల్ మొదటి వారంలో రానున్నారని, ఇండోర్ స్టేడియం ప్రారంభించడంతోపాటు కొత్తగా ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, జడ్పీటీసీ సభ్యులు ఉమేష్, నాయకులు వి.ఎం.పాండురంగప్ప, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు లేనివారికి మంజూరు చేయండి: ఎమ్మెల్యే

నియోజకవర్గంలో ఇల్లు లేని ప్రతి పేదవాడికి మంజూరు చేయాలని, నిర్లక్ష్యం తగదని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. ఆదివారం హౌసింగ్ ఏఈలతో సమావేశమయ్యారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ ఇల్లు మంజూరు విషయంలో చేతివాటం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

పార్టీలోకి చేరిక

మడకశిరటౌన్(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పట్టణ వైసీపీ మాజీ కన్వీనర్ పుట్టకామప్ప, పలువురు వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

హత్యాయత్నం కేసులో 8మంది అరెస్టు

గోరంట్ల, మార్చి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంగారెడ్డిపల్లి వద్ద భూ వివాదానికి సంబంధించి ఇరువర్గాలు మరణాయుధాలతో దాడి చేసుకున్న సంఘటనపై ఆదివారం 8మందిని అరెస్టు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. వారి నుంచి రెండు కొడవళ్లు, ఇనుప పైపు, రాళ్లు, స్వాధీనం చేసుకున్నామన్నారు. కాంగారెడ్డిపల్లికి చెందిన రంగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హిందూపురం టీచర్స్‌కాలనీకి చెందిన రాజశేఖర్‌రెడ్డి, కాంగారెడ్డిపల్లికి చెందిన బయప్పరెడ్డి, నరేంద్రరెడ్డిలపై హత్యయత్నం కేసును శనివారం నమోదు చేశారు. హిందూపురం టీచర్స్‌కాలనీకి చెందిన రాజశేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కాంగారెడ్డిపల్లికి చెందిన అశ్వత్థరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, రంగారెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారు. వీరిరువు భూవివాదానికి సంబంధించి దాడులు చేసుకున్నారు. వారి ఫిర్యాదుల మేరకు రెండు హత్యాయత్నం కేసులు నమోదు చేశామన్నారు. నిందితులు 8 మందిని పెనుకొండ కోర్టుకు హాజరు పరిచామని సీఐ తెలిపారు.


హత్యాయత్నానికి ఉపయోగించిన మారణాయుధాలను చూపుతున్న సీఐ శేఖర్, సిబ్బంది

మరమ్మతుల పరిశీలన

గోరంట్ల, మార్చి23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళాశాల ఎస్సీ బాలుర వసతి గృహంలో జరుగుతున్న మరమ్మతు పనులను ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు మానిటరింగ్ కమిటీ సభ్యుడు దేవరకొండ ఉమాశంకర్ ఆదివారం పరిశీలించారు. వసతిగృహంలో పెయింటింగ్, ఎలక్ట్రీషియన్ పనులు జరుగుతుండగా సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగప్రసాద్‌తో కలిసి వసతిగృహాన్ని సందర్శించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పేకాట స్థావరంపై దాడి

8 మంది అరెస్టు, ద్విచక్రవాహనాల సీజ్

హిందూపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొటిపి, కెంచనపల్లి మధ్యలో ఉన్న హంద్రీనీవా కాలువలో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో అప్‌గ్రేడ్ పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.30వేలు నగదు, ద్విచక్రవాహనాలు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఆంజనేయులు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ మునిప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ

పెనుకొండ రూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టూరు గ్రామంలో సీనియర్ వైసీపీ నాయకుడు పిట్ట ఆదిశేషు తండ్రి ఆంజనేయులు అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆదిశేషు కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, బాబు, కన్వీనర్ బోయ నరసింహులు, పొగాకు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ మరింత అభివృద్ధి

మున్సిపల్ చైర్మన్


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

హిందూపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ఆటోనగర్‌ను ఐలాకు అప్పగించడం పట్ల మరింత అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. ఆదివారం ఆటోనగర్‌వాసులు సమావేశమై ఎమ్మెల్యే బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ రమేష్, మాజీ మునిసిపల్ చైర్మన్ అనీల్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా ఆటోనగర్‌వాసులు ఇబ్బందులు పడ్డారని, ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని జీవో41 ద్వారా ఐలాకు బదిలీ చేయించడం అభినందనీయమన్నారు. ఎన్నో ఏళ్ల క్రితం ఆటోనగర్‌వాసులకు కేటాయించిన స్థలాలను విక్రయించడానికి రిజిస్ట్రేషన్ కావడంలేదు. కానీ ఇండస్ట్రీయల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా)కు అప్పగించడంతో ఇక రిజిస్ట్రేషన్లు కానున్నాయన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు అవకాశం ఉందన్నారు. అనీల్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో ఇచ్చిన ఎమ్మెల్యే హామీని నెరవేర్చారన్నారు. స్థలాల రిజిస్ట్రేషన్ కోసం ఎన్నోఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఇకమీదట అలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో ఆటోనగర్ అసోసియేషన్ నాయకులు అంజాద్, మల్లికార్జున, టీడీపీ నాయకులు అమర్నాథ్, ఆదిల్, అశ్వకుల్లా, డైమండ్‌బాబా, అమీన్, ఫాజిల్, ముస్తాక్ పాల్గొన్నారు.

ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత


మాట్లాడుతున్న భక్తవృందదాస్

హిందూపురం అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత సాధ్యమని ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధి భక్తవృందదాస్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయాల దర్శనతో అనంతకోటి పాపాలు నశిస్తాయన్నారు. భగవద్గీతను విశ్వానికి అందించిన శ్రీకృష్ణుడి వ్యాఖ్యలను అందరూ పాటిస్తే విశ్వశాంతి సాధ్యమన్నారు. ఈనెల 27న హిందూపురంలో శ్రీకృష్ణ మందిర నిర్మాణానికి భూమి పూజ జరగనుందన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు


ఇసుకను యంత్రంతో తవ్వుతున్న దృశ్యం

గోరంట్ల, మార్చి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి వద్ద చిత్రావతి నదిలో ఇసుక తరలిస్తుడంతో స్థానిక రైతులు, గ్రామస్థులు ఆదివారం అడ్డుకున్నారు. బూదిలివద్ద చిత్రావతి వంతెన శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం రూ.8.52కోట్లు నిధులు మంజూరు చేసింది. కొత్త బ్రిడ్జి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు సంబంధించి అనుచరులు పనులు ప్రారంభంకాకుండానే ముందస్తుగా ఇసుక సేకరణకు శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. అవసరానికి మించి పెద్దఎత్తున ఇసుక తరలింపు జరుగుతండడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ప్రస్తుత సర్పంచ్ రామంజనేయులు, రైతులు, చిత్రావతి నదిలోని ఇసుక తరలింపులను అడ్డుకున్నారు.

సిద్దేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

అమరాపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలిసిన హెంజేరు సిద్దేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఉదయం సుప్రభాతసేవ, వివిధ రకాల అర్చనలు, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం చేశారు. అనంతరం సిద్దేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి వెండికవచాన్ని ధరింపజేశారు. మహా మంగళ హారతిని ఇచ్చి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కరేగౌడ్, ప్రధాన అర్చకులు సిద్దలింగేశ్వరస్వామి, శివకుమార్‌స్వామి, రవిశంకర్, గౌతమ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘననివాళి

పెనుకొండ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతిని పెనుకొండలో ప్రజాసంఘాలు ఆదివారం నిర్వహించారు. ఘనగిరి పాఠశాలలో జరిగిన సభకు ముఖ్య అతిథిగా డాక్టర్ రోహిల్‌కుమార్ హాజరయ్యారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన మహనీయుడు భగత్‌సింగ్ అని అన్నారు. రైతు సంఘం అధ్యక్షుడు హరి మాట్లాడుతూ క్షమాభిక్ష అవకాశం ఉన్నా తిరస్కరించి ఉరికొయ్యిని ముద్దాడిన యోధుడు భగత్‌సింగ్ అన్నారు. సభలో ప్రజా సంఘాల నాయకులు బాబావలి, రమేష్, నబీ, ఇమ్రాన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్, (ఆంధ్రజ్యోతి): దేశం గర్వించదగ్గ నాయకుడు భగత్‌సింగ్ అని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుక్‌దేవ్‌ల పోరాటస్ఫూర్తితో విద్యార్థి యువజన సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. అతి చిన్న వయసులోనే దేశ స్వాతంత్యం కోసం ప్రాణాలర్పించిన గొప్పనాయకుడన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భగత్‌సింగ్ రాజ్‌గురు సుఖ్‌దేవ్‌ల జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. 94వ జయంతి సందర్భంగా మునిసిపల్ కారాలయం ముందుభాగంలో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాబావలి,జయచంద్ర, దిలీప్, సురేష్ పాల్గొన్నారు


పెనుకొండలో నివాళులు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు